
సాక్షి
పల్నాడు
బుధవారం । 27 । ఆగస్టు । 2025



పాఠశాలలకు ఫర్నిచర్ వితరణ

మంగళగిరి టౌన్: నగర పరిధిలోని పలు పాఠశాలలకు రూ. 1.75లక్షల విలువైన ఫర్నిచర్‌ను మంగళవారం ఐడీబీఐ బ్యాంక్ ప్రతినిధులు అందజేశారు.



పులిచింతల సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 1,28,831 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా.. దిగువకు 1,15,832 క్యూసెక్కులు వదులుతున్నారు.



పశ్చిమ డెల్టాకు 8,216 క్యూసెక్కులు

దుగ్గిరాల: ప్రకాశం బ్యారేజ్ నుంచి 8,216 క్యూసెక్కులు విడుదల చేసినట్లు నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు. బ్యారేజీ వద్ద 12 అడుగులు నీటి మట్టం ఉంది.

గతం సుసంపన్నం

లైమ్ సిటీలో సున్నం పరిశ్రమ కకావికలం

- తెల్లబోతున్న సున్నం పరిశ్రమ
- దక్షిణ భారతదేశంలో సున్నం పరిశ్రమకు పెట్టింది పేరు పిడుగురాళ్ల
- 20 ఏళ్ల క్రితం పట్టణ పరిధిలో 250 బట్టీలతో 20 వేల మందికి ఉపాధి
- నేడు 55 బట్టీలలో 5 వేల మందికి మాత్రమే పని
- భారీగా పతనమైన పిడుగురాళ్ల సున్నం వ్యాపారం
- రాజస్థాన్‌లో తక్కువధరకే నాణ్యమైన సున్నం
- ఇతర దేశాల నుంచి దిగుమతి కూడా మరో కారణం
- ఉపాధి కరువై ఇతర ప్రాంతాలకు వలస వెళ్తున్న కూలీలు



పిడుగురాళ్ల పట్టణంలోని సున్నం బట్టీలు (ఇన్‌సెట్) సున్నం రాయిని పగలగొడుతున్న కార్మికులు

సాక్షి, నరసరావుపేట, పిడుగురాళ్ల: గతంలో కళ కళలాడిన సున్నం పరిశ్రమ నేడు వెలవెలబోతోంది. దక్షిణ భారత దేశంలోనే లైమ్ సిటీగా పిలువబడే పిడుగురాళ్ల పట్టణం ఇప్పుడు సున్నం వ్యాపారం రోజు రోజుకి పడిపోయి తెల్లబోతోంది. సున్నం బట్టీల సంఖ్య క్రమంగా తగ్గుతూ వస్తుంది. వ్యాపారులు పెట్టుబడులు పెట్టి వ్యాపారాన్ని పెంచేందుకు ప్రయత్నించినప్పటికీ పోటీ మార్కెట్‌లో స్థానిక సున్నం పోటీపడలేక నానాటికీ వ్యాపారం తగ్గిపోతోంది. దీంతో ఈ పరిశ్రమపై ప్రత్యక్షంగా ఆధారపడిన వ్యాపారులు, కార్మికులు, పరోక్షంగా ఆధారపడిన వాహన, ఇతర రంగాల వ్యాపారులు, కూలీలు ఉపాధి లేక ఇతర ఆదాయ మార్గాలు అన్వేషిస్తున్నారు. వేలాది కుటుంబాలకు అన్నం పెట్టిన సున్నం పరిశ్రమ నానాటికీ ప్రభ కోల్పోతుండటంపై స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఈ పరిశ్రమ నిలబడటానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

నాడు కళకళ.. నేడు వెలవెల

సున్నం పరిశ్రమంటే పిడుగురాళ్లే గుర్తుకు వస్తుంది. 20 ఏళ్ల క్రితం పట్టణంలో సుమారు 250 సున్నం పరిశ్రమలు ఉండేవి. ఆ సమయంలో సున్నం పరిశ్రమపై ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 18 వేల నుంచి 20 వేల మంది వరకు కార్మికులు, ఉద్యోగులు, వాహనదారులు, వ్యాపారులు ఆధారపడే వారు. ఇక్కడ ఉత్పత్తి అయిన సున్నాన్ని ఇతర దేశాలకు ఎగుమతి చేయడంతో పిడుగురాళ్లకు వ్యాపారపరంగా ప్రత్యేక గుర్తింపు వచ్చి లైమ్ సిటీగా పేరొందింది. ఈ పరిశ్రమపై ఆధారపడి ఆర్థికంగా, సామాజికపరంగా పట్టణ ప్రజలు ఎంతో అభివృద్ధి చెందారు. ప్రస్తుతం పిడుగురాళ్ల పట్టణంలో కేవలం 55 సున్నం పరిశ్రమలు మాత్రమే పనిచేస్తున్నాయి. సుమారు కేవలం 5 వేల నుంచి 7 వేల మంది కార్మికులు, ఉద్యోగులు, వ్యాపారులు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి పొందుతున్నారు. కార్మికులు ప్రస్తుతం రోజుకు రూ. 500ల నుంచి రూ. 550 పొందుతున్నారు. ఉపాధి అవకాశాలు పెరగడం, ముఖ్యంగా ప్రకాశం జిల్లా నుంచి వచ్చే వలస కూలీల సంఖ్య రోజురోజుకు తగ్గిపోవడం కూడా సున్నం పరిశ్రమలకు ఇబ్బందికరంగా మారింది.

భారీగా పెరిగిన ఉత్పత్తి వ్యయం

సున్నం పరిశ్రమకు ఉపయోగించే ముడి సరుకుల ధరలు భారీగా పెరగడంతో గత్యంతరం లేక సున్నం ధరలు పెంచాల్సి వచ్చిందని స్థానిక వ్యాపారులు చెబుతున్నారు. ప్రధానంగా మైనింగ్ రాయల్టీ టన్నుకు రూ. 100 పెంచారు. గతంలో సున్నం రాయిని కాల్చే జరియా బొగ్గు టన్ను రూ. 4 వేలు ఉంటే అది నేడు రూ. 12 వేల నుంచి రూ. 18 వేలకు పెరిగింది. సున్నపు రాయి గతంలో టన్ను రూ. 100 ఉంటే ఇప్పుడు ఏకంగా రూ. 400 పెరిగింది. వీటితో పాటు కార్మికుల కూలీలు భారీగా పెరగడంతో ఉత్పత్తి అయిన సున్నంకు ధరలు పెంచాల్సిన పరిస్థితి. దీంతో మార్కెట్‌లో ఇంపోర్టెడ్ క్వాలిటీ సున్నం తక్కువ ధరకు దొరుకుతుండటంతో ఇక్కడి సున్నంకు ప్రాధాన్యత తగ్గుతూ వస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం సున్నం పరిశ్రమను ఆదుకుంటే ఇప్పుడున్న సున్నం బట్టీలైన ఉంటాయి, లేని పక్షంలో ఉన్న కొద్ది పరిశ్రమలు సైతం క్రమేపీ తగ్గే అవకాశం ఉందని వ్యాపారులు పేర్కొంటున్నారు.

ఇతర ప్రాంతాల్లో నాణ్యమైన సున్నం

పిడుగురాళ్ల మాదిరిగా రాజస్థాన్‌లో కూడా లైమ్ క్వారీలు ఏర్పాడ్డాయి. దీంతో ఉత్తర భారతదేశానికి రవాణా చార్జీలు తగ్గదలతో పాటు తక్కువ ధరకు నాణ్యమైన సున్నం లభించడంతో వ్యాపారులు ఎక్కువగా రాజస్థాన్ వైపు మొగ్గు చూపుతున్నారు. అంతేకాకుండా వియత్నాం, దుబాయ్ ఇలా విదేశాల నుంచి పెద్ద ఎత్తున సున్నం దిగుమతి అవుతుంది. అది కూడా మనకంటే తక్కువ ధరలకు ఎక్కువ నాణ్యమైన సరుకు దొరుకుతుండటంతో వాప్యారులు ఆవైపు మొగ్గు చూపుతున్నారు.

సున్నం బట్టీలు పెరిగితే బాగుండు..



సున్నం రాయిని కాల్చే బొగ్గును చిన్న చిన్న ముక్కలుగా చేస్తాం. మాకు రోజుకు రూ. 300 కూలి ఇస్తారు. చాలా మంది కార్మికులు పనులు లేక ఇబ్బందులు పడుతున్నారు. సున్నం బట్టీలు పెరిగితే మాలాంటి వారికి రోజూ పని దొరుకుతుంది.

– మంగయ్య, సున్నం బట్టీ కార్మికుడు, పిడుగురాళ్ల

ఇతర ప్రాంతాలకు వలస వెళ్తున్నాం...



ప్రతి రోజు పని చేస్తేనే మాకు పూట గడుస్తుంది. బట్టీల్లో రోజూ పనులు చేస్తాం. గతంలో బట్టీలు ఎక్కువగా ఉండేవి, చాలామందికి ఉపాధి ఉండేది. ఇప్పుడు బట్టీలు తగ్గాయి, మాలాంటి కూలీలకు పని లేకుండా పోయింది. ఇతర ప్రాంతాలకు వలస వెళ్లి పనులు వెతుక్కునే పరిస్థితి వచ్చింది.

– పద్మ, సున్నం బట్టీ కార్మికురాలు, పిడుగురాళ్ల

న్యూస్‌రీల్

వినాయక చవితి శుభాకాంక్షలు



జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు

నరసరావుపేట: ప్రజలందరికీ జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు వినాయకచవితి మంగళవారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. వినాయకచవితి పర్వదినం అందరికీ సుఖ శాంతులు, ఆరోగ్యం, అభివృద్ధి కలిగించాలని ఆకాంక్షించారు. విఘ్నేశ్వరుడు బుద్ధి, జ్ఞానం, విజయానికి ప్రతీక అన్నారు. పర్యావరణాన్ని దృష్టిలో ఉంచుకొని మట్టి వినాయకులనే ప్రతిష్టించవలసిందిగా ఆయన కోరారు. ఉత్సవాల సందర్భంలో శుభ్రత, శాంతి భద్రతలను కాపాడుతూ ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. వినాయక నిమజ్జనంలో సమన్వయంతో పాల్గొని, అధికార యంత్రాంగానికి సహకరించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ తెలిపారు.

వైభవంగా 'శ్రీతుల్జాభవానీ' బ్రహ్మోత్సవాలు



అచ్చంపేట: మండలంలోని పుట్లగూడెం గ్రామం నుంచి వెంకటాయపాలెం వెళ్లే అటవీ మార్గంలో స్వయంభూగా వెలసిన శ్రీ తుల్జాభవానీ మునీశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహా కుంకుమార్చనలు, భజన కార్యక్రమాలు జరిగాయి. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు భూక్యా రమేష్ నాయక్, ఎంపీపీ భూక్యా స్వర్ణమ్మబాయ్, వంశపారంపర్య ధర్మకర్త భూక్యా బీటీనాయక్‌లు మాట్లాడుతూ ఇప్పటివరకు ఏ ఆదరణకు నోచుకోని శ్రీ తుల్జాభవానీ మునీశ్వరస్వామి వారికి వైభవం తీసుకు వచ్చే దిశగా ప్రయత్నం చేస్తున్నామన్నారు. మాదిపాడు సర్పంచ్ వెంకట్రావు, మాజీ సర్పంచ్ వల్లభనేని వెంకటేశ్వరరావు, వెంకటాయపాలెం సర్పంచ్ మేళ్ల శ్రీరామమూర్తి, ఆర్యవైశ్య జిల్లా సంఘం నాయకుడు జేవర శెట్టి శ్రీనివాసరావు, మాదిపాడు గ్రామ పెద్ద కొలగాని సత్యనారాయణ, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ఆల్మాస్‌కు బ్రాంజ్ మెడల్



మంగళగిరి: పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పట్టణానికి చెందిన సాదియా ఆల్మాస్ అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటింది. ప్రపంచ జూనియర్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్–2025 పోటీల్లో బ్రాంజ్ మెడల్ సాధించింది. ఈనెల 24వ తేదీ నుంచి సెప్టెంబర్ 3 వరకు సంజోష్ జిల్లా కోస్టారికాలో పోటీలు జరుగుతున్నాయి. ఇందులో స్క్వాట్ 185 కేజీలు, బెంచ్ ప్రెస్ 100 కేజీలు, డెడ్ లిఫ్ట్ 105 కేజీలు (సిల్వర్ మెడల్) కలిపి మొత్తం 470 కేజీల బరువు ఎత్తి బ్రాంజ్ మెడల్ సాధించినట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కొమ్మాకుల విజయభాస్కర రావు, షేక్ సంధాని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర, జిల్లా అసోసియేషన్‌లు ఆల్మాస్‌ను అభినందించినట్లు పేర్కొన్నారు.

రైల్వేలపై సమస్యలు ఉంటే తెలియజేయండి !

జెడ్‌ఆర్‌యూసీసీ సభ్యుడు ఆతుకూరి ఆంజనేయులు



నగరంపాలెం: సికింద్రాబాద్ రైల్వే నిలయంలో వచ్చే నెల 3న జోనల్ రైల్వే యూజర్స్ కన్జూమర్ కమిటీ (జెడ్‌ఆర్‌యూసీసీ) సమావేశం జరగనున్నట్లు సభ్యుడు, ది ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ గౌరవ శాశ్వత అధ్యక్షుడు ఆతుకూరి ఆంజనేయులు తెలిపారు. జిన్నా టవర్ కూడలిలోని ది ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. గుంటూరు రైల్వేస్టేషన్, న్యూ గుంటూరు రైల్వే స్టేషన్, నంబూరు రైల్వేస్టేషన్లను అభివృద్ధి చేయాలని కోరుతూ ఇప్పటికే లేఖల ద్వారా దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారులకు తెలియజేశానని ఆయన పేర్కొన్నారు. గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని ప్రధాన రైల్వేస్టేషన్లలో ప్రయాణికుల సౌకర్యార్థం మెరుగైన మౌలిక సౌకర్యాలు కల్పించాలని కోరినట్లు తెలిపారు.

పండుగ వేళ ప్రయాణానికి ఇక్కట్లు



బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

నరసరావుపేట: వినాయకచవితి పండగ వేళ గమ్యస్థానాలకు తీసుకెళ్లే బస్సులు సకాలంలో రాక అనేక మంది ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. స్థానికంగా ఉన్న ప్రైవేటు కళాశాలల్లో చదివే విద్యార్థులకు పండగ సెలవులు ప్రకటించటంతో వారందరూ గమ్యస్థానాలకు వెళ్లేందుకు మంగళవారం బస్టాండ్‌కు చేరుకున్నారు. దీనికి తోడు స్త్రీ శక్తి పథకం అమలులో ఉండటంతో మహిళలు సైతం బస్టాండ్‌లో వేచి ఉన్నారు. అయితే గంటలతరబడి వేచిచూసినా బస్సులు రాకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. స్థానిక డిపోలో 84 బస్సులు ఉండగా వాటిలో 55 బస్సులు స్త్రీ శక్తి పథకానికి వినియోగిస్తున్నారు. ఈ పథకం అమలు కారణంగా బస్సుల రాకపోకలు ఆలస్యంగా కొనసాగుతున్నాయి. కాగా, స్త్రీ శక్తి పథకంలో బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే మహిళలను కొన్ని బస్సుల కండక్టర్లు గుర్తింపు కార్డులు చూపించాలని అడుగుతున్నారని మహిళలు చెబుతున్నారు. దీనిపై డిపో మేనేజర్ బూదాటి శ్రీనివాసరావును వివరణ కోరగా.. గుర్తింపు కార్డులు చూపించాలని, లేనిపక్షంలో డబ్బులు చెల్లించి టిక్కెట్లు తీసుకోవాలని తామెటువంటి ఉత్తర్వులు జారీ చేయలేదన్నారు. మరికొన్నిరోజుల పాటు గుర్తింపుకార్డుల అవసరం లేకుండానే ప్రయాణించవచ్చని పేర్కొన్నారు.



బస్సుల రాక ఆలస్యం కావడంతో బస్టాండ్‌లో నిరీక్షణ



సత్తెనపల్లిలో మట్టి విగ్రహాలను తయారు చేస్తున్న మహిళ



సత్తెనపల్లి గడియార స్తంభం సెంటర్‌లో పత్రి కొనుగోలు



నరసరావుపేటలో మండపానికి తరలి వెళుతున్న గణనాథుడు



బాల పందిళ్లలో కొలువుదీర్చేందుకు చిన్న విగ్రహాల కొనుగోలు

గణపతి పూజకు వేళాయె..!

విఘ్నాధిపతి, ప్రథమ పూజ్యుడు, విఘ్నేశ్వరుడు.. ఇలా భక్తులతో పిలుపులందుకునే గణనాథుడి పూజకు వేళయింది. జిల్లా మార్కెట్‌కు వినాయక చవితి కళ వచ్చింది. జిల్లాలోని పట్టణాలు, పల్లెల్లో వీధి వీధినా వినాయక మండపాల ఏర్పాటులో యువకులు, ఉత్సవ కమిటీలు నిమగ్నమయ్యారు. బుధవారం వినాయక చవితిని పురస్కరించుకొని గణనాథుడిని కొలిచేందుకు భక్తులు సిద్ధమయ్యారు. మండపాలలో భారీ వినాయక విగ్రహాలు ఏర్పాటు చేశారు. పలు సంస్థల ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు.

– సత్తెనపల్లి, నరసరావుపేట ఈస్ట్

ఏఆర్ కానిస్టేబుల్ ఆత్మహత్యాయత్నం వీడియో కలకలం

మహిళ చేతిలో మోసపోయానని, ఆత్మహత్యే శరణ్యమంటూ సెల్ఫీ వీడియో



ఏఆర్ కానిస్టేబుల్ షరీఫ్

మాచర్ల రూరల్: మాచర్ల రూరల్ పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న ఏఆర్ కానిస్టేబుల్ షరీఫ్ ఆత్మహత్యాయత్నం వీడియో మంగళవారం కలకలం సృష్టించింది. వీడియో వివరాలు ఇలాఉన్నాయి.. తన వద్ద ఓ మహిళ రూ. లక్ష, ఆ తరువాత రూ. 75వేలు తీసుకుందని, ఆ డబ్బులు తిరిగి చెల్లించమని అడిగితే ఆమె, ఆమె భర్త తన పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెడతామని బెదిరింపులకు పాల్పడుతున్నారని వీడియోలో వాపోయాడు. తన భార్యకు అన్యాయం చేసి ఈ మహిళ విషయంలో సన్నిహితంగా ఉండి కుటుంబాన్ని దూరం చేసుకున్నానని సదరు కానిస్టేబుల్ వాపోయాడు. ఆ యువతితో తనకు వివాహేతర సంబంధం ఉందని, తమకు ఒక బిడ్డ కూడా ఉందని చెప్పాడు. పట్టణ శివారులోని ఎంఎస్ఆర్ టౌన్ షిప్‌లో నివాసముంటున్నామని వీడియోలో పేర్కొన్నాడు. తన తల్లిదండ్రులు ఇష్టం లేని పెళ్లి చేసి తన గొంతు కోశారంటూ మాయమాటలు చెప్పి ఆమె తనకు దగ్గరైనట్లు వీడియోలో వెల్లడించాడు. నగదు విషయంలో ఇద్దరి మధ్య విభేదాలు రావటంతో తనపై డీఎస్పీ, ఎస్పీలకు ఫిర్యాదు చేసిందని, ఈ నేపథ్యంలో తనకు ఆత్మహత్యే శరణ్యమని, తన చావుకు అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నా తల్లిదండ్రుల చావుకు కూడా వారిదే బాధ్యతని వాపోయాడు. తను చనిపోయాక తన శవాన్ని భార్య, పిల్లలు చూడాలని కోరాడు.

- ఈ వీడియో వైరల్ కావటంతో ఏఆర్ కానిస్టేబుల్ కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో తాళ్లపల్లి, సాగర్ కుడి కాలువ వద్ద ఉన్న షరీఫ్‌ను రూరల్ స్టేషన్‌కు తరలించి కౌన్సెలింగ్ ఇచ్చారు. షరీఫ్‌పై సోమవారం నరసరావుపేటలో ఎస్పీ కార్యాలయంలోని మహిళా పోలీసు స్టేషన్‌లో సదరు మహిళ ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఇరు వర్గాల ఫిర్యాదులను తీసుకొని పరిశీలిస్తున్నట్లు రూరల్ సీఐ షేక్ హాఫీజ్ బాషా తెలిపారు.

రేపు డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలన

గుంటూరు ఎడ్యుకేషన్: డీఎస్సీ–2025 సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ ఈనెల 28న గుంటూరులోని ఏసీ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ కేటగిరీల వారీగా జోన్ ఆఫ్ కన్సిడరేషన్‌లోకి వచ్చి, వ్యక్తిగతంగా డీఎస్సీ లాగిన్ ద్వారా కాల్ లెటర్లు అందుకున్న అభ్యర్థులు వాటిని డౌన్లోడ్ చేసుకుని, అందులోని సూచనలు పాటించాలని ఆమె సూచించారు. సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియకు హాజరయ్యే ముందుగా వెబ్‌సైట్‌లో వ్యక్తిగత డీఎస్సీ–2025 లాగిన్ ద్వారా అప్‌లోడ్ చేసుకుని, పరిశీలనకు హాజరుకావాలని తెలిపారు. విద్యార్హతలకు సంబంధించిన ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు గెజిటెడ్ అధికారితో అటెస్ట్ చేయించిన మూడు సెట్ల ఫొటోస్టాట్ కాపీలు, ఐదు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, సామాజిక వర్గ ధ్రువీకరణ, వైకల్య నిర్ధారణ పత్రాలతో పాటు కాల్ లెటర్‌తో హాజరు కావాలని ఆమె సూచించారు.

రాష్ట్రంలో రెడ్‌బుక్ అరాచక పాలన

- వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు ధ్వజం
- గుంటూరులోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రసాద్‌కు మాజీ ఎమ్మెల్యేలు గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, బొల్లా బ్రహ్మనాయుడుతో కలసి పరామర్శ
- పోలీసులు న్యాయబద్ధంగా విచారణ చేపట్టాలని డిమాండ్



వెంకటప్రసాద్ సోదరుడు వెంకటేశ్వర్లు గాయాలను పరిశీలిస్తున్న అంబటి రాంబాబు, డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు తదితరులు

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): రాష్ట్రంలో నారా లోకేష్ రెడ్ బుక్ అరాచక పాలన నడుస్తోందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి అంబటి రాంబాబు మండిపడ్డారు. అక్రమ అరెస్టులతో వైఎస్సార్ సీపీ నేతలు ఆసుపత్రులు,జైళ్లు, పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరగడం సరిపోతోందని తెలిపారు. వినుకొండ నియోజకవర్గం టి. అన్నవరంలో టీడీపీ గూండాల దాడిలో తీవ్రంగా గాయపడి, గుంటూరులోని ప్రైవేట్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్న వైఎస్సార్ సీపీ నేత వెంకట ప్రసాద్‌ను మంగళవారం పార్టీ పల్నాడు జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుతో కలిసి పరామర్శించారు. దాడిలో వెంకట ప్రసాద్ సోదరుడు వెంకటేశ్వర్లుకు అయిన గాయాలను పరిశీలించారు. అంబటి రాంబాబు మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఏజెంట్‌గా వెంకట ప్రసాద్ పని చేయడంతో అతడిని అంతం చేయాలని ప్లాన్ చేశారని ఆరోపించారు. ఈ కేసులో పోలీసులు సింపుల్‌గా 324 కేసు పేశారని తెలిపారు. రాజీపడమని నోటీసులు తీసుకునే సింపుల్ కేసు నమోదు చేశారని మండిపడ్డారు. రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థ కూటమి ప్రభుత్వానికి తొత్తుగా పని చేస్తోందని విమర్శించారు. న్యూట్రల్‌గా ఉండాల్సిన పోలీసులు అధికార పార్టీకి ఏకపక్షంగా పని చేస్తున్నారని ఆరోపించారు. నారా లోకేష్ రెడ్ బుక్ ఎల్లకాలం ఉండదని, రానున్న రోజుల్లో వేరే బుక్కులు వస్తాయనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని హితవు పలికారు. మాచర్లలో రెండు టీడీపీ ముఠాలు కొట్టుకొని హత్యలు చేసుకుంటే, మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిపై అక్రమ కేసు నమోదు చేశారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదట్లోనే వినుకొండలో రషీద్ అనే వైఎస్సార్ సీపీ కార్యకర్తను అతి కిరాతకంగా నరికి చంపారన్నారు. రాష్ట్రంలో ఇంత అరాచకాలు జరుగుతున్నా డీజీపీ, ఎస్పీలు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలపై పెట్టే అక్రమ కేసులపై న్యాయస్థానాల ద్వారా పోరాటం చేస్తామని తెలిపారు.

బాధితుడి పైనే కేసు నమోదు

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ టీడీపీ గూండాల దాడిలో తీవ్రంగా గాయపడిన వైఎస్సార్ సీపీ నేత వెంకట ప్రసాద్ ప్రాణాపాయ పరిస్థితుల్లో ఉంటే అతడి పైనే కేసు నమోదు చేయడం దారుణమని ఖండించారు. హత్యాయత్నానికి గురైన బాధితుడుపైనే తిరిగి పోలీసులు కేసు నమోదు చేయడం చూస్తే రెడ్ బుక్ రాజ్యాంగం ఎంత బలంగా పనిచేస్తుందో అర్థం చేసుకోవచ్చని తెలిపారు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఈ హత్య జరిగిందంటూ వినుకొండ టీడీపీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పచ్చి అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు.

కక్షతోనే దాడి : మాజీ ఎమ్మెల్యే బొల్లా



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బొల్లా

రాష్ట్రంలో నారా లోకేష్ ఆధ్వర్యంలో రెడ్ బుక్ రాజ్యాంగం పక్కాగా అమలు జరుగుతోందని, దాని డైరెక్షన్‌లోనే టీడీపీ నేతలు వైఎస్సార్ సీపీ నేతలపై దాడులకు తెగబడుతున్నారని వినుకొండ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పేర్కొన్నారు. 2024 ఎన్నికల్లో వెంకట ప్రసాద్ వైఎస్సార్ సీపీ ఏజెంట్‌గా పని చేశాడనే కక్షతోనే స్థానిక టీడీపీ గూండాలు ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ప్రోద్బలంతో అతన్ని చంపేందుకు ప్రయత్నం చేశారని మండిపడ్డారు. ఎమ్మెల్యే అకృత్యాలపై పోలీసులు న్యాయబద్ధంగా విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

ప్రశాంత వాతావరణంలో పండుగ జరుపుకోవాలి

జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు



నరసరావుపేట రూరల్: వినాయక చవితి వేడుకలను ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించుకునే విధంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం ఆయన జిల్లా ప్రజలకు వినాయకచవితి శుభాకాంక్షలను తెలిపారు. పోలీసు శాఖ సూచనలు, ఆదేశాలను తప్పనిసరిగా వినాయక మండప నిర్వాహకులు పాటించాలని సూచించారు. చవితి వేడుకలను పురస్కరించుకొని ఎటువంటి అవాంఛనీయ ఘటనలు తావు లేకుండా పటిష్టమైన భద్రతా చర్యలను తీసుకుంటున్నట్టు వివరించారు. ఉదయం 6గంటల నుంచి రాత్రి 10గంటల వరకు మాత్రమే స్పీకర్లు వినియోగించాలన్నారు. ఎక్కడైన అవాంఛనీయ సంఘటనలు తలెత్తితే పోలీసు అధికారులకు లేదా 100, 112 నంబర్లకు కాల్‌చేసి సమాచారం అందించాలని కోరారు.

మట్టి గణపతిని పూజిద్దాం



సత్తెనపల్లి: పర్యావరణ హితంగా మట్టి గణపతితో వినాయక చవితి పండుగను జరుపుకోవాలని లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్) పల్నాడు జిల్లా అధ్యక్షుడు, న్యాయవాది జొన్నలగడ్డ విజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. పట్టణంలోని పాత పద్మశాలి పేట, రాజుల కాలనీ, బ్రహ్మంగారి గుడి సెంటర్, కొత్తపేట తదితర ప్రాంతాల్లో పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం మట్టి వినాయక ప్రతిమలు, వినాయకవ్రత కల్ప పుస్తకాల పంపిణీ చేపట్టారు. విజయ్‌కుమార్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యతను తెలియజేసే పండుగే ఈ వినాయక చవితి అన్నారు. భగవంతుని స్వరూపాలైన గాలి, నేల, నీరు చెట్టు, ప్రేమ విశిష్టతను చవితి తెలియజేస్తుందన్నారు. నాయకులు కాకరపర్తి సతీష్, పాత్తూరి దుర్గారావు, షేక్ సుభాని, జానీ, కరిముల్లా, జొన్నలగడ్డ సంజయ్ కుమార్, మహంకాళి వెంకట్రావ్, కారుమంచి గంగరాజు పాల్గొన్నారు.

‘బార్’లకు స్పందన నామమాత్రం

- దరఖాస్తుల గడువు పొడిగింపు
- 54 బార్లకు గాను దాఖలైంది 22 దరఖాస్తులే..
- చిలకలూరిపేట, వినుకొండ, మాచర్ల, పిడుగురాళ్లలో స్పందన శూన్యం



నరసరావుపేట టౌన్: కూటమి ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన బార్ అండ్ రెస్టారెంట్ల దరఖాస్తు గడువును పొడిగించింది. తొలుత ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం మంగళవారంతో గడువు ముగియాల్సి ఉండగా ఆశించిన మేర స్పందన రాకపోవడంతో ఈ నెల 29వరకు పెంచారు. జిల్లాలో ఉన్న 49 సాధారణ, 5 గీత కులాలకు సంబంధించిన బార్లకు నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే.. దరఖాస్తు ఫీజు రూ.5లక్షలు, ఒక్కో బార్‌కు కనీసం నాలుగు దరఖాస్తులు దాఖలు చేస్తేనే లాటరీ ప్రక్రియ కొనసాగేలా ప్రభుత్వం నిబంధన పెట్టింది. ఈ లెక్కన 54 బార్లకు 216 దరఖాస్తులు పైబడి రావాల్సి ఉంది.

■ కూటమి నేతల కనుసన్నల్లో మద్యం వ్యాపారాలు చేయాల్సి ఉండటంతో ఇతర వ్యాపారులెవరూ ముందుకు రావడం లేదు. దీంతో అధికారులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. 54 బార్లకు కాను కేవలం 22 దరఖాస్తులు మాత్రమే మంగళవారం గడువు ముగిసే సమయానికి నమోదయ్యాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇందులో మూడు బార్ అండ్ రెస్టారెంట్లకు నాలుగు చొప్పున దరఖాస్తులు, పది బార్‌లకు ఒక్కోటి చొప్పున దరఖాస్తులు నమోదయ్యాయి. సత్తెనపల్లిలో ఉన్న 5 బార్లలో రెండింటికి నాలుగేసి చొప్పున, రెండింటికి ఒక్కొక్కటి చొప్పున దరఖాస్తులు రాగా, ఒక బార్‌కు దరఖాస్తులు దాఖలు కాలేదు. నరసరావుపేటలో 18 బార్ అండ్ రెస్టారెంట్లు ఉండగా కేవలం నాలుగు బార్ అండ్ రెస్టారెంట్లకు ఒక్కొక్కటి చొప్పున మాత్రమే అందాయి. చిలకలూరిపేట, వినుకొండ, మాచర్ల, పిడుగురాళ్లలో బార్ అండ్ రెస్టారెంట్లకు ఒక్క దరఖాస్తు కూడా నమోదు కాకపోవడం గమనార్హం.

29 వరకు గడువు పొడిగింపు...



బార్ అండ్ రెస్టారెంట్ల మూడేళ్ల కాలపరిమితి లైసెన్స్‌ల దరఖాస్తుల గడువును ఈనెల 29వ తేదీ వరకు ప్రభుత్వం పొడిగించింది. ఓపెన్, గీత కులాల రిజర్వ్‌డ్ బార్‌లకు కలిపి మొత్తం 54 బార్ అండ్ రెస్టారెంట్లకు ఈ నెల 30వ తేదీన లాటరీ తీయడం జరుగుతుంది. జిల్లా కలెక్టర్ సమక్షంలో పారదర్శకంగా ఈ ప్రక్రియ నిర్వహిస్తాం.

– మణికంత, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్

పంచాయతీలకు నిధులు విడుదల చేయాలి

కలెక్టర్‌ను కోరిన ఏపీ సర్పంచుల సంఘం ముఖ్య సలహాదారు



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జాస్తి వీరాంజనేయులు

నరసరావుపేట: జిల్లాలో గ్రామ పంచాయతీలకు తొమ్మిది నెలల నుంచి రావాల్సిన 15వ ఆర్థిక సంఘ నిధులు, రిజిస్ట్రేషన్ సర్‌ఛార్జి నిధులను విడుదల చేయాలని అఖిల భారత పంచాయతీ పరిషత్ (న్యూఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షుడు, ఏపీ సర్పంచుల సంక్షేమ సంఘ ముఖ్యసలహాదారు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు విజ్ఞప్తి చేసారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబును కలిసి వినతిపత్రం సమర్పించారు. రిజిస్ట్రేషన్ సర్ చార్జి నిధులు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వాటిని గ్రామ పంచాయతీలకు బదిలీ అయ్యేవిధంగా కృషిచేయాలని, రిజిస్ట్రేషన్ ఐజీతో మాట్లాడాలని విజ్ఞప్తి చేశారు. ఈసందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. జిల్లావ్యాప్తంగా 526 గ్రామ పంచాయతీలలో రిజిస్ట్రేషన్ సర్‌చార్జి, 15వ ఆర్థిక సంఘం నిధులు వస్తే సర్పంచులు, గ్రామ పంచాయతీలకు ఊరటగా ఉంటుందన్నారు. గ్రామాలలో నీటి సరఫరాకు, బ్లీచింగ్‌కు, పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు, విద్యుత్ బకాయిలు ఇచ్చేందుకు వెసులుబాటుగా ఉంటుందన్నారు. ప్రస్తుతం చాలా గ్రామ పంచాయతీల్లో వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా బ్లీచింగ్ కొనేందుకు, పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు ఇచ్చేందుకు కూడా నిధులు లేకుండా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమస్యపై ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టి సారించి నిధులు విడుదలకు కృషిచేయాలని కోరారు. ఈ నిధులు విడుదల చేయకపోతే గత నెలలోనే కేంద్రం నుంచి రాష్ట్రంలోని స్థానిక సంస్థలకు రావలసిన రూ.1000కోట్లు ఆగిపోయే ప్రమాదం ఉందన్నారు. దీనికి కలెక్టర్ స్పందించి సమస్యను ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా కృషిచేస్తానని హామీ ఇచ్చినట్లు వెల్లడించారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

- జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు
- బెల్లంకొండ మండలం రామాంజనేపురంలో పర్యటన



గ్రామస్తులతో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

బెల్లంకొండ: మండలంలోని మన్నెసుల్తాన్‌పాలెం పంచాయతీ పరిధిలో గల రామాంజనేయపురం గ్రామంలో వెంటనే మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు తెలిపారు. మంగళవారం రామాంజనేయపురం గ్రామంలో ఆయన పర్యటించారు. ముందుగా గ్రామంలో నిర్మాణం పూర్తయి ప్రారంభానికి నోచుకోని ప్రాథమిక పాఠశాలలను పరిశీలించారు. ఎన్నో ఏళ్లుగా గ్రామంలో పాఠశాల కోసం ఎదురు చూస్తున్నామని, గత ప్రభుత్వ హయాంలో పాఠశాల భవనాన్ని నిర్మించారని గ్రామస్తులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. కానీ ఇంతవరకు పాఠశాలలో సిబ్బందిని ఏర్పాటు చేసి విద్యా బోధన చేపట్టలేదని తెలిపారు. పాఠశాలకు యూడైస్ కోడ్ రాని కారణంగా ఉపాధ్యాయుల నియామకానికి, మధ్యాహ్న భోజన పథకానికి పలు ఇబ్బందులు ఉన్నాయని డీఈఓ కలెక్టర్‌కు వివరించారు. వారం రోజుల్లో పాఠశాలకు ఇద్దరు ఉపాధ్యాయులను నియమించి, విద్యాబోధన చేపట్టాలని కలెక్టర్ డీఈఓకు ఆదేశించారు.

– అనంతరం గ్రామంలోని ప్రధాన కూడలిలో అధికారులు, గ్రామస్తులతో సమావేశం నిర్వహించి, సమస్యలు తెలుసుకున్నారు. తాము నివసించే ఇళ్లకు పట్టాలు లేవని, ఒక్క వీధికి కూడా సిమెంట్ రోడ్లు లేవని గ్రామస్తులు వాపోయారు. అటవీ ప్రాంతంలో ఉండడంతో మంచినీటి బోరు వేసుకోవాలన్న అటవీ అధికారులు అడ్డుకుంటున్నారని తెలిపారు. రేషన్ బియ్యం తెచ్చుకోవాలన్నా పక్క గ్రామమైన మన్నెసుల్తాన్ పాలెంకు వెళ్తున్నామని బాధలు చెప్పుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అటవీ అధికారులతో సమీక్ష ఏర్పాటు చేసి రామాంజనేయ పురాన్ని గ్రామకంఠంగా విభజిస్తామని, ఇళ్ల పట్టాలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటానని తెలిపారు. గ్రామంలో సీసీ రోడ్లు నిర్మించే విధంగా అధికారులకు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ రమణకాంత్ రెడ్డి, డీఈఓ చంద్రకళ, డీఎంహెచ్‌ఓ రవి, అటవీశాఖ రేంజ్ అధికారి విజయకుమారి, తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, ఎంఈఓ బాలసుందరరావు, ఇంచార్జ్ ఎంపీడీఓ శ్రీనివాస్ నాయక్, ఏపీడీ నారాయణ ఉన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో తనిఖీలు..

రాజుపాలెం: మండల కేంద్రంలోని స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. శిథిలావస్థకు చేరిన కార్యాలయంలో భయంతో విధులు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ సరోజ కలెక్టర్‌కు వివరించారు. వెంటనే స్పందించిన కలెక్టర్ ఏదైనా ప్రభుత్వ కార్యాలయం ఖాళీగా ఉంటే తన దృష్టికి తేవాలని, మీకు అనుకూలంగా ఉంటే ఆ కార్యాలయంలోకి మారుస్తామని తెలిపారు. ఆయన వెంట సత్తెనపల్లి ఆర్డీఓ రమాకాంత్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ జానీబాషా, ఆర్ఐ గోపి తదితరులు ఉన్నారు.

జాబ్‌మేళాలో 117 మందికి ఉద్యోగాలు



ఉద్యోగాలకు ఎంపికైన వారికి నియామక పత్రాలు అందిస్తున్న తమ్మాజీరావు

నరసరావుపేట ఈస్ట్: జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎస్‌ఎసీ శిక్షణా కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాలో 117 మంది అభ్యర్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఇ.తమ్మాజీరావు తెలిపారు. కలెక్టరేట్ కార్యాలయ సమీపంలోని ఎస్‌ఎసీ కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన జాబ్‌మేళాకు 273 మంది నిరుద్యోగులు హాజరు కాగా 10 కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులైన 117 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసుకున్నట్టు వివరించారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించేందుకు నైపుణ్యాభివృద్ధి సంస్థ కృషి చేస్తున్నట్టు తెలిపారు. యువత నైపుణ్యాలను పెంపొందించుకోవాలని హితవు పలికారు. తమ సంస్థ నైపుణ్యాలను పెంపొందించటంతో పాటు జాబ్‌మేళాలు నిర్వహించి వారికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుందని స్పష్టం చేశారు. ఎస్‌ఎసీ శిక్షణా కేంద్రం ఇన్‌ఛార్జ్ మేరీ జోత్స్న, జిల్లా ఉద్యోగ కల్పన అధికారి ఎం.రవీంద్రనాయక్, స్కిల్ హబ్ కో–ఆర్డినేటర్ ఎం.వీరాంజనేయులు, ఎ.రమ్య, వివిధ కంపెనీల హెచ్‌ఆర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

చెరువులో గల్లంతైన యువకుడు మృతి



గోపినాయక్ మృతదేహం

కొల్లూరు: చెరువులో పడి గల్లంతైన యువకుడి మృతదేహాన్ని గజ ఈతగాళ్ల సాయంతో పోలీసులు వెలికితీయించారు. సోమవారం రాత్రి కొల్లూరు శివారు బోస్‌నగర్‌లో సభావత్తు గోపినాయక్ (34) గ్రామాన్ని అనుకొని ఉన్న చెరువులో పడి గల్లంతైన విషయం విదితమే. అతని పెద్దమ్మ ఇంటికి వెళ్లి తిరిగి వచ్చే క్రమంలో చెరువులో పడిన వ్యక్తిని గమనించిన మహిళ స్థానికులను అప్రమత్తం చేసింది. స్థానికులు అతని కోసం గాలించినా ప్రయోజనం లేకపోవడంతో కొల్లూరు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సోమవారం రాత్రి గజ ఈతగాళ్లను చెరువులోకి దింపి గల్లంతైన యువకుడి కోసం గాలించారు. అర్ధరాత్రి సమయంలో మృతదేహం లభ్యమైంది. మృతుడి తల్లి దుర్గమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు ఎస్ఐ జానకి అమరవర్ధన్ తెలిపారు.

సంక్షేమ వసతి గృహ విద్యార్థి ఆత్మహత్యాయత్నం



వైద్యశాలలో చికిత్స పొందుతున్న విద్యార్థి తాళ్లూరి సూర్య

సత్తెనపల్లి: సంక్షేమ వసతి గృహ విద్యార్థి ఆత్మహత్యకు యత్నించిన సంఘటన పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో మంగళవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి... అచ్చంపేట మండలం అంబటిపూడి గ్రామానికి చెందిన తాళ్లూరి సూర్య జంగంగుంట్ల పాలెంలోని కేసీ రెడ్డి కళాశాలలో బీ ఫార్మసీ తృతీయ సంవత్సరం విద్యనభ్యశిస్తూ సత్తెనపల్లి రైల్వే గేట్ సమీపంలోని ఎస్సీ కళాశాల బాలుర వసతి గృహంలో ఉంటున్నాడు. ఈ నెల 22న సాయంత్రం వసతి గృహం నుంచి ఇంటికి వెళ్లి మంగళవారం మధ్యాహ్నం 2.30 గంటలకు తిరిగి హాస్టల్‌కు చేరుకున్నాడు. హాస్టల్‌లో బ్యాగ్ సర్దుకొని ఇంటికని చెప్పి బయటకు వెళ్లి తిరిగి 3.30 గంటలకు మళ్లీ హాస్టల్లోకి వచ్చాడు. వెంటనే గది లోకి వెళ్లి 10 నిమిషాలు పాటు ఉన్న సూర్య బయటకు వచ్చి వసతిగృహంలో పనిచేసే కుక్ శ్యాంబాబుతో తనకు కళ్లు తిరుగుతున్నాయని, హాస్పటల్‌కు తీసుకు వెళ్లమని కోరాడు. కుక్ శ్యాంబాబు సరేనని దగ్గరకు రాగా పురుగుమందు వాసన వస్తుండడంతో ఏం జరిగిందో చెప్పమని సూర్యను ప్రశ్నించాడు. తాను ఆత్మహత్య చేసుకునేందుకు గడ్డి మందు తాగానని చెప్పాడు. వెంటనే కుక్ శ్యాంబాబు సంక్షేమ వసతి గృహ అధికారి పాపయ్యకు సమాచారం అందించి, సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా వైద్యులు తాగిన మందును కక్కించి ప్రాథమిక వైద్యం అందించి మెరుగైన వైద్యానికి గుంటూరు సిఫార్సు చేశారు. దీంతో సంక్షేమ వసతి గృహ అధికారి పాపయ్య విద్యార్థి తల్లిదండ్రులైన అశోక్, సుజాతకు సమాచారం అందించాడు. హుటాహుటిన గుంటూరు జీజీహెచ్‌కు తరలించగా ప్రస్తుతం వైద్యశాలలో డయాలసిస్ వైద్యసేవలు అందిస్తున్నారు. ప్రేమ వ్యవహారంలో భాగంగా చదువుకోవటం కష్టంగా ఉందంటూ విద్యార్థి సూర్య వాపోయినట్లు సమాచారం. ఈ ఘటన సంక్షేమ కళాశాల వసతి గృహంలో కలకలం రేపింది. చేతికి వచ్చిన కుమారుడు ఆత్మహత్యకు యత్నించడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరవుతున్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఐదుగురి అరెస్టు

తెనాలి రూరల్: గంజాయి వినియోగంతో పాటు విక్రయిస్తున్న ఐదుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక బాలాజీరావుపేట కొబ్బరి చెట్ల వద్ద గంజాయి తాగుతున్నారన్న సమాచారంతో త్రీ టౌన్ పోలీసులు మంగళవారం ఆకస్మిక దాడులు చేశారు. ఐదుగురు యువకులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 1,150 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

మోసపోయాం.. ఆదుకోండి

ఎంపీ లావుతో ‘యానిమేషన్’ బాధితులు



ఎంపీ శ్రీకృష్ణదేవరాయలును కలిసిన యానిమేషన్ స్కాం బాధితులు

నరసరావుపేట టౌన్: నమ్మి మోసపోయాం.. నిందితులను అరెస్ట్ చేసి పోలీసులు చేతులు దులుపుకొన్నారు. నిందితులు దోచుకున్న సొమ్ముతో కొన్న ఆస్తులతో పాటు దారిమళ్లించిన సొత్తును పూర్తిస్థాయిలో స్వాధీనం చేసుకోలేదు. తమకు ఎలాగైనా న్యాయం జరిగేలా చూడాలని యానిమేషన్ స్కాంలో మోసపోయిన బాధితులు సోమవారం నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలును కలిసి విన్నవించారు. విజయవాడ కేంద్రంగా యూపిక్స్ క్రియేషన్స్ పేరిట యానిమేషన్ కంపెనీను ఏర్పాటు చేసి అందులో పెట్టుబడి పెడితే ఎక్కువ లాభాలు వస్తాయని నమ్మించి రూ.కోట్లు వసూళ్లు చేసి చివరకు బోర్డు తిప్పేసిన సంగతి తెలిసిందే. నష్టపోయిన బాధితుల్లో అధిక శాతం నరసరావుపేట వాసులే. అరెస్ట్ అయిన నిందితుడు మిట్టపల్లి రాజేంద్ర ప్రసాద్ అలియాస్ రాజుకు నరసరావుపేటలో బంధుత్వం ఉన్న కారణంగా ఎక్కువమంది యానిమేషన్ మాయకు ఆకర్షితులై మోసపోయారు. బాధితులంతా ఎంపీని కలిసి నిందితులను అరెస్ట్ చేసిన సమయంలో నామమాత్రంగా రికవరీ చేశారని, పూర్తిస్థాయిలో ఆస్తులను గుర్తించి, వాటిని స్వాధీనం చేసుకొని నష్టపోయిన వారందరికీ న్యాయం జరిగేలా చూడాలని కోరారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తానని ఎంపీ వారికి హామీ ఇచ్చారు. ఎంపీని కలిసిన వారిలో ఆతుకూరి అమర లింగేశ్వరరావు, పచ్చిపులుసు వెంకటేష్, గుండా అనిల్, గుండా హనుమంతరావు, మిట్టపల్లి హర్ష, పెరుమళ్ల రవి, కొప్పరావూరి ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

ముగిసిన జిల్లా ఫెన్సింగ్ పోటీలు



పతకాలు సాధించిన విద్యార్థులతో కోచ్‌లు, అసోసియేషన్ నాయకులు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): ఉమ్మడి గుంటూరు జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక బీఆర్ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి అండర్–17 బాలబాలికల పోటీలు ముగిశాయి. జిల్లా కార్యదర్శి డి.అశోక్ బాబు మాట్లాడుతూ ఈ పోటీల్లో ప్రతిభకనబరచిన వారిని ఈ నెల 30న పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో జరగనున్న అంతర్ జిల్లాల పోటీలకు పంపిస్తామని తెలిపారు. పోటీలను ఖేలో ఇండియా కోచ్ చిరంజీవి, డీఎస్ఏ కోచ్ కె.సంగీత బాబు ఆధ్వర్యంలో నిర్వహించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ చైర్మన్ డి.ఎస్. క్రిష్టోఫర్, కోచ్‌లు పాల్గొన్నారు.